నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
10 | కరీంనగర్, శనివారం 11 మే 2024 | PEDDAPALLI

### నేతన్నలు ఆలోచించాలి

ఇది చేనేత కార్మికులు ఎక్కువగా నివసించే పట్టణం. గతంలో ఇక్కడ చాలా ఆత్మహత్యలు జరిగినయి. అప్పుడు నేను కండ్ల నీళ్లు పెట్టుకున్న. చాలా బాధపడ్డ. బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత అనేక స్కీంలు తెచ్చిన.. బతుకమ్మ చీరలు కావొచ్చు, విద్యార్థుల డ్రెస్‌లు కావొచ్చు, క్రిస్మస్, రంజాన్‌కు ఇచ్చే కానుకలు కావొచ్చు.. ఇలా కార్మికులను ఆదుకున్నాం. కానీ, ఐదు నెలల్లో అంతా తారుమారైంది. ఇక్కడ కార్మికులకు రూ.370 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నయి. వాటిని చెల్లించాలని అడిగితే.. 'మీకెందుకు మీరు నిరోధ్‌లు, పాపడాలు అమ్ముకోండి' అని పద్మశాలీ, నేత కార్మికులను అవమానిస్తే నాకు కోపం వచ్చింది. ఒక్క మాట అంటే నామీద 48 గంటల నిషేధం పెట్టిన్రు. ఇది మీరు గమనించాలి. మంచి చేసేదెవరో ఆలోచించాలి.

### తెలంగాణ గౌరవం కాపాడాలె

కరీంనగర్ గడ్డ చాలా చైతన్యవంతమైనది. ఒకనాడు కాంగ్రెస్ తెలంగాణను అవమానిస్తే నేను పార్లమెంట్ స్థానానికి రాజీనామా చేసిన. అప్పుడు మీరే అందరు సద్ది కట్టి, రెండున్నర లక్షల మెజార్టీతో గెలిపించిన్రు. తెలంగాణ ఉద్యమ గౌరవాన్ని పెంచిన గడ్డ కరీంనగర్. మళ్లీ ఇప్పుడు క్లిష్ట పరిస్థితుల్లో ఈ కరీంనగర్ గడ్డ తెలంగాణ గౌరవం కాపాడాలె.

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

### సంజయ్‌కి.. వినోద్‌కు పోలికా..?

బండి సంజయ్‌కి వినోద్‌కు ఏమైనా పోలిక ఉన్నదా? సంజయ్ మాట్లాడితే మనకేమైనా అర్థమైతదా? ఆయన మాట్లాడేది ఏం భాష? అది హిందా.. ఇంగ్లిషా.. తెలుగా? అదే వినోద్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి ఎంతో కృషి చేసిండు. 2001 నుంచి నాతో పాటు ఉద్యమంలో ఉన్నడు. రాష్ట్రాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించిండు. అంతేకాదు, దివంగత న్యాయవాది, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజేశ్వర్‌రావు మేనల్లుడే మన వినోద్ కుమార్. కమ్యూనిస్ట్ కుంటుంబం నుంచి తెలంగాణ కోసం కొట్లాడి, ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడంలో నావెంట పనిచేసిన వ్యక్తి. చదువుకున్న వ్యక్తి. పార్లమెంట్‌లో మన కోసం కొట్లాడిన వ్యక్తి. కరీంనగర్ సీటుతోపాటు చాలాచోట్ల మనమే గెలువబోతున్నం. ఎంపీ సీట్లలో మనదే మెజార్టీ. కరీంనగర్‌లో నంబర్‌వన్ మెజార్టీ ఇచ్చి గెలిపించాలి.

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



### సిరిసిల్ల జిల్లా ఉండాల్నా? పోవాల్నా?

రాజన్న సిరిసిల్ల జిల్లా బిడ్డల్లారా మీకో మాట చెబుతున్న. మీ ఆకాంక్షను గౌరవించి నేను రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు చేసిన. దేవుడి పేరు ఉండాలని వేములవాడ రాజన్న పేరు జిల్లాకు పెట్టుకున్నం. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల జిల్లా రద్దు చేస్తామంటున్నడు. సిరిసిల్ల జిల్లా ఉండాల్నా? పోవాల్నా? సిరిసిల్ల జిల్లా ఉండాలంటే ఇక్కడ వినోద్‌కుమార్ గెలువాలి. ఎందుకంటే రేపు తీసేస్త అంటే కూడా అడ్డంపడి కొట్లాడేటోడు, యుద్ధం చేసేటోడు కావాలి. మీరు నాకు బలం ఇస్తే సిరిసిల్ల జిల్లా కాపాడే బాధ్యత నాది. ఎంతకైనా యుద్ధం చేద్దాం. సిరిసిల్ల జిల్లాను కాపాడుకోవాలన్నా.. జలాలు కాపాడుకోవాలన్నా.. నేత కార్మికుల బతుకులు మునుపటి లెక్క బాగుండాలన్నా కచ్చితంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్





సిరిసిల్లలోని నేతన్న చౌరస్తాలో రోడ్‌షోకు అశేషంగా తరలివచ్చిన జనవాహిని. అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

# సిరిసిల్ల జిల్లా ఉండాలంటే వినోద్ గెలువాలి

జిల్లాను కాపాడుకోవాలన్నా.. గోదావరిని కాపాడుకోవాలన్నా..
నేత కార్మికుల బతుకులు బాగుండాలన్నా
రాష్ట్రంలోనే నంబర్‌వన్ మెజార్టీ ఇచ్చి బీఆర్ఎస్ అభ్యర్థిని దీవించండి

- మోదీ వేములవాడకు వచ్చి ఏం ఇచ్చిండు • బండి నిధులు ఎందుకు అడుగలేదు
- సంజయ్‌కి వినోద్‌కు పోలిక ఉన్నదా • కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసింది
- మరమగ్గాలు మూలనపడే దుస్థితి వచ్చింది • ఈ గడ్డ చాలా చైతన్యవంతమైనది
- మీరు నాకు బలం ఇవ్వండి.. కాపాడే బాధ్యత నాది • నేతకార్మికుల్లారా ఆలోచించి ఓటు వేయండి
- లేకుంటే మన బతుకులు ఆగమైతయి • సిరిసిల్ల రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

కరీంనగర్, మే 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / రాజన్న సిరిసిల్ల (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలిస్తేనే సిరిసిల్ల జిల్లా ఉంటుందని, ఇక్కడి చేనేత కార్మికులకు బతుకుదెరువు ఉంటుందని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో మరమగ్గాలు మూలనపడే పరిస్థితి వచ్చిందని, చేనేత కార్మికులు సచ్చిపోయే దుస్థితి వచ్చిందని, ఏ ఒక్కరినీ ఆదుకోలేదని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. దేశంలో మొట్టమొదటి సారి చేనేతపై జీఎస్టీ వేసిన మొదటి ప్రధాని నరేంద్ర మోదీ అని, ఇప్పటి వరకు ఏ ప్రధాని ఇలా చేయలేదని మండిపడ్డారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆగం కావద్దని, ఆలోచించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే మన కోసం పనిచేస్తారని, కరీంనగర్‌లో వినోద్ కుమార్‌ను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి గులాబీ బాస్ సిరిసిల్ల నేతన్న చౌరస్తాలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అశేషంగా తరలివచ్చిన జనవాహినిని ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. కరీంనగర్ గడ్డపై నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ ఎంపీగా గెలువాల్సిన అవశ్యకతను ప్రజలకు పూసగుచ్చినట్టుగా వివరిస్తూనే.. ఇదే సమయంలో బీజేపీ, కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. నిత్యం దేశం కోసం, ధర్మం కోసం అని మాట్లాడే మోడీ మొన్న వేములవాడకు వచ్చినప్పుడు అభివృద్ధి కోసం నిధులు ఎందుకు కేటాయించలేదని సూటిగా ప్రశ్నించారు. పొద్దున లేస్తే హిందూ హిందూ.. అని మాట్లాడే బండి సంజయ్.. పక్కనే ఉండి కూడా దేవస్థానం బాగు కోసం నిధులు ఎందుకు అడుగలేదని నిలదీశారు. దేవుడి పేరు చెప్పే సంజయ్ ఒక్క రూపాయి అడగలేదని, ఆయన కూడా ఇయ్యలేదని మండిప డ్డారు. కానీ, తాను ఇక్కడకు వచ్చి, చెరువులోంచి దాదాపు 35 ఎకరాలు స్థలం ఇప్పించి డెవలప్ చేశామని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలిచ్చి, అరచేతిలో వైకుంఠం చూపి గద్దెనెక్కిందని ఘాటుగా విమర్శించారు. మహిళలకు రూ.2500 రాలేదని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని, రైతుబంధు కింద రూ.పది వేలు రాలేదని, ఏ ఒక్కటీ కాలేదని, కరెంట్, నీళ్లు కూడా రాలేదని ఆగ్రహించారు. ఒకే ఒక ఉచిత బస్ పెట్టిందని, దాంతో బస్సుల్లో ఆడోళ్లు సర్కస్ చేసినట్టు తన్నుకుంటున్నారని, ఆటోరిక్షా కార్మికులేమో 'అన్నమోరామచంద్రా' అని ఏడుస్తున్నారని ఆవేదన చెందారు. రైతుబంధు ఇవ్వడానికి వెనుకాడిన ప్రభుత్వం ఇవాళ ధాన్యం కూడా కొంటలేదని, అకాల వర్షాలకు కల్లాల్లో తడిసిపోతే కూడా అడిగే దిక్కులేదని, కొనే దిక్కులేదని ఆగ్రహించారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మరోసారి మోసపోతామని హెచ్చరించారు. మన కోసం కొట్లాడే, మన కోసం పనిచేసే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### మోడీకి చేనేత కార్మికులంటే లెక్కనే లేదు

నరేంద్ర మోడీ అన్నీ తీసేసిండు. చేనేత కార్మికులకున్న ఇన్సూరెన్స్, ఇతర పథకాలను రద్దు చేసిండు. మోడీకి చేనేత కార్మికులంటే లెక్కనే లేదు. బీజేపీ ఎజెండాలో పేదలు, కార్మికులు, రైతులు, ఆటోరిక్షా కార్మికులు ఉండరు. పేద వాళ్ల ఎజెండా అసలే ఉండదు. పెద్ద పెద్ద గద్దల ఎజెండా మాత్రమే ఉంటది. అంబానీ, అదానీ, లక్షల కోట్ల శ్రీమంతులు వాళ్లకు కార్పొరేట్ టాక్స్‌లు రద్దు చేస్తరు తప్ప పేద వాళ్లకు కాదు.

- కేసీఆర్

### మోసపోతే గోసపడుతం

పదేండ్ల కిందట మోడీ ఓ చెప్పిండు. విదేశాల్లో ఉన్న నల్లడబ్బు తెచ్చి మనిషికి ₹15లక్షలు ఏస్త అన్నడు. సిరిసిల్ల వాళ్లకు వచ్చినయట కదా? బండి సంజయ్ తెచ్చిచ్చిండట కదా? ₹15 లక్షలు రాలె.. ₹15 రూపాయలు రాలె. ఏమీ కాలె. అంతటా వట్టిదే. అంతా గ్యాసు.. ట్రాషు! ఎవరికీ న్యాయం జరగలె. ఒక వేళ మోడీ మరోసారి గెలిస్తే పెట్రోల్, డీజిల్ ధర ₹400 దాటుతది. మోసపోతే గోసపడుతం. జాగ్రత్తా!

- కేసీఆర్



ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

### ఈ సర్కారు ఎందుకు బంద్ పెట్టింది?

ఒకనాడు సిరిసిల్లలో చేనేత చనిపోతుంటే నేను బాధపట్టలేక ఏడ్సిన. పార్టీ నుంచి రూ.50 లక్షలు తెచ్చి, ట్రస్ట్ ఏర్పాటు చేసిన. మీరు చనిపోవద్దు అని బతకాలని బతిమిలాడిన. రాష్ట్రం వచ్చిన తర్వాత ఇదే కేటీఆర్ ఆధ్వర్యంలో అనేక స్కీంలు తెచ్చుకున్నం. కార్మికులకు బతుకు దెరువు చూపినం. సిరిసిల్లకు ఒక టెక్స్‌టైల్ పార్క్ కావాలని మోడీని అడిగినా ఇయ్యలే. అయినా కూడా ఉన్నంతలో బతుకమ్మ చీరలో.. రంజాన్ గిఫ్ట్‌లో.. స్కూల్ యూనిఫాంలో ఏదో ఒకటి ఇచ్చి మిమ్మల్ని కాపాడుకున్నం. మరమగ్గాల కార్మికులను కూడా కాపాడుకున్నం. కనీసం నెలకు ₹15 వేలు, ₹20 వేలు జీతం వచ్చేలా పని కల్పించినం. నేడు ఈ సర్కారు అన్నీ బంద్ పెడుతున్నది. పాత బకాయిలు, కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదు. పేదలకు బట్టలు దొరుకతయని, చేనేత కార్మికులకు ఇంత పని దొరుకుతుందని మేము ఆర్డర్లు ఇస్తే ఈ సర్కారు ఎందుకు బంద్ పెట్టింది. గుడ్డిగా ఓట్లేయడం కాదు, ఎవరో చెబితే వేయడం కాదు, మనబతుకేంది? మనమేంది ఆలోచన చేయాలి.

- కేసీఆర్

### ఆలోచించి ఓటు వేయాలి

దయచేసి మీరంతా ఆలోచించి ఓటేయాలె. ఆగమాగం కావద్దు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, విద్యావంతులు ఆలోచించాలి. సిరిసిల్లలో మంచి రచయితలు ఉన్నరు. పెద్దింటి అశోక్ కుమార్ వంటి మేధావులున్నరు. మీరందరూ ఆలోచన చేయాలి. ఇవాళ మోడీ వచ్చి మన గోదారిని ఎత్తుకుపోత అంటున్నడు. మనం గోదావరి నుంచి నీళ్లు తెచ్చి అప్పర్ మానేరు ఎలా చేసుకున్నమో.. మానేరు నదిని సజీవ నదిలా ఎలా చేసుకున్నామో.. మిడ్‌మానేరు ఎంత బ్రహ్మాండంగా కళకళలాడుతుండెనో.. ఇప్పుడు మొత్తం ఎండబెట్టిన్రు. మన గోదావరి నది పోతే ఎక్కన్నుంచి నీళ్లు రావాలె. మనం ఏ విధంగా బతకాలె. ఇక్కడ కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. దయచేసి మనం ఇవన్నీ ఆలోచన చేయాలె. ఏం చేయకుండానే వట్టిగనే ఓటేస్తమంటే మన బతుకులు కూడా గావర గావర అయితయి తప్ప ఏం జరగదు. మంచిగా చర్చించి ఓటేయాలి.



సిరిసిల్లలో బీఆర్ఎస్ అధినేతకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న కార్మిక కుటుంబాల మహిళలు

# కార్మికక్షేత్రం జనసంద్రం

## కేసీఆర్ రోడ్ షో గ్రాండ్ సక్సెస్



అధినేతకు బ్రహ్మరథం
నేతన్నల ఘన స్వాగతం

కరీంనగర్, మే 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ రాజన్న సిరిసిల్ల (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిరిసిల్ల నీరాజనం పలికింది. డప్పులు, బోనాలు, మంగళహారతులు పట్టి కార్మిక క్షేత్రం ఘనంగా స్వాగతించింది. జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో గులాబీ దళంలో మరింత జోష్ కనిపించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో కరీంనగర్‌లోని కేసీఆర్ భవన్ నుంచి సిరిసిల్లకు బయలు దేరి వెళ్లిన గులాబీ బాస్‌కు దారి పొడవునా ప్రజలు అపూర్వ స్వాగతం తెలిపారు. 6.43 గంటలకు కేసీఆర్ సిరిసిల్ల కొత్త చెరువు వద్దకు చేరుకోగా, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్, వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం తెలిపారు. అక్కడి నుంచి రోడ్‌షో ప్రారంభమై.. నేతన్న చౌరస్తా వరకు సాగింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు, అభిమానులు, గులాబీ నాయకుల కోలాహలం మధ్య ర్యాలీ సాగింది. కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోకు అపూర్వ స్పందన వచ్చింది.

నేతన్న చౌక్ వద్దకు చేరుకున్న అధినేత 7.07 గంటల నుంచి 7.23 గంటల వరకు తన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. ఆయన ప్రసంగం ప్రారంభించగానే 'సీఎం కేసీఆర్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఒక దశలో కేసీఆర్ జోక్యం చేసుకొని.. ప్లీజ్ సైలెంట్‌గా ఉండండి.. అంటూ రిక్వెస్ట్ చేశారు. తదుపరి స్పీచ్ ప్రారంభించిన కేసీఆర్.. కరీంనగర్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలువాల్సిన అవసరం, ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఇదే సమయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. బండి సంజయ్‌కీ.. వినోద్‌కుమార్ ఉన్న తేడాను వివరించి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో నేతన్నలు పడిన కష్టాలు, బీఆర్ఎస్ పాలనలో దక్కిన భరోసా, మళ్లీ ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో గోసపడుతున్న తీరును వివరించారు. ఈ కష్టాలు పోవాలంటే గులాబీ జెండా ద్వారానే సాధ్యమని ధైర్యం నింపారు. అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆగం కావద్దని, ఆలోచించి ఓటు వేయాలని, బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. అబద్ధపు పునాదులపై గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను, అలాగే చేనేత పరిశ్రమపై జీఎస్టీ విధించిన బీజేపీని తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కాగా, తమ బతుకులకు భరోసానిచ్చి అండగా నిలిచిన కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికేందుకు నేతన్నలు సాంచాలు బంద్‌పెట్టి తరలివచ్చారు. అశేషంగా తరలివచ్చిన జనంతో నేతన్న చౌక్ జనసంద్రం కాగా, బస్సుపై నుంచి ప్రసంగిస్తున్న కేసీఆర్‌ను చూసేందుకు అభిమానులు బంగ్లాలు, హోర్డింగ్‌ల పైకి ఎక్కారు. గులాబీ దళపతి ప్రసంగం ప్రారంభించగానే పటాకులు కాల్చి తమ అభిమానం చాటుకున్నారు. క్రేన్ సహాయంతో అతిపెద్ద గజమాలను వేసేందుకు తీసుకొచ్చారు. కాగా, కేసీఆర్ రోడ్‌షో విజయవంతం కావడంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండింది. అశేషజనం అధినేతకు నీరాజనం పలుకడం.. ఇదే సమయంలో కేసీఆర్ ప్రసంగం ఆలోచింపజేయడం, ఆయన మాట్లాడినంత సేపు జనంలో వచ్చిన స్పందనను చూసి నయా జోష్ కనిపించింది.

# కార్మికుడి బిడ్డనా..శ్రీమంతుడా?

- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల

గోదావరిఖని, మే 10 : 'మీ బాధలు తెలిసిన కార్మికుడా? లేదంటే ఏసీ రూముల్లో ఉంటూ మీ సాదకబాధకాలు తెలియని శ్రీమంతుడా? ఎవరు కావాలో మీరే ఆలోచించాలి' అంటూ ఓటర్లకు పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే కారు గుర్తుకు ఓటేసి, ప్రశ్నించే గొంతుకకు పట్టంగట్టాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మంథని, పెగడపల్లి, గొల్లపల్లి, ధర్మారంలో నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో పాల్గొన్నారు. ఖనిలోని రమేశ్‌నగర్, ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో లోని బేస్ వర్క్‌షాప్, ఎస్అండ్‌డీ, షావల్, డోజర్ సెక్షన్లలో కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఆయాచోట్ల కొప్పుల మాట్లాడారు. మోసపూరిత హామీలిచ్చి అధికారం చేపట్టిన హస్తం పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఆయన వెంట పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ మంత్రి రాజేశంగౌడ్ తదితరులు ఉన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

# 12 స్థానాలు గెలుస్తున్నాం

- బీజేపీ, కాంగ్రెస్ చేసిందేమీలేదు
- మళ్లీ కేసీఆరే సీఎం అవుతారు
- వీణవంక గ్రామాన్ని దత్తత తీసుకుంటా
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంట్లో బస

వీణవంక, మే 10 : పార్లమెంట్ ఎన్నికల్లో 12 స్థానాలు గెలుస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. వీణవంక మండల కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసానికి శుక్రవారం రాత్రి రాగా, మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నివాసం ఆవరణలో వీణవంక గ్రామస్తులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధించింది, అభివృద్ధి చేసింది కేసీఆర్ మాత్రమేనని, మళ్లీ కేసీఆరే సీఎం అవుతారని, మరిన్ని మంచి పనులు చేసుకుందామని చెప్పారు. ఉప ఎన్నికల్లో గెల్లు శ్రీనివాస్ బాగా పోరాడారని, 2023 ఎన్నికల్లో కౌశిక్‌రెడ్డిని గెలిపించి కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలో ఉన్న బీజేపీ దేవుళ్ల పేరుచెప్పి ఓట్లు అడుగుతున్నదని, ఎంపీగా బండి సంజయ్ రూపాయి పని చేయలేదని, ప్రజలకు కనీసం ముఖం కూడా చూపెట్టలేదని ధ్వజమెత్తారు. మోదీ ప్రియమైన పీఎం కాదని, పిరమైన పీఎం అని, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, మళ్లీ ఏవో కట్టుకథలు చెప్పి ఓట్లు అడగడానికి వస్తున్నారని జాగ్రత్తగా ఆలోచన చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ కేసీఆరే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని, 12 ఎంపీ స్థానాలు గెలిచి, వచ్చే ఆరు నెలల్లో కేసీఆర్‌నే మళ్లీ సీఎంను చేద్దామని అన్నారు. వీణవంక గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఉన్న ప్రేమతో వచ్చిన మహిళలకు, యువతీయువకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఇంట్లో బస చేశారు. ఇక్కడ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎంపీపీ రేణుక-తిరుపతిరెడ్డి, వైస్ఎంపీపీ లత-శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.